క్లుప్తంగా

ఏకాగ్రతతో చదవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం: ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని స్టేట్ పీఎంయూ సమగ్ర శిక్ష అధికారి డాక్టర్ ఛాయేంద్ర కుమార్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాలను బుధవారం ఆయనతో పాటు జీసీడీఓ సువర్చ సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురి కాకుండా చదువుతూ ఉన్నత స్థానానికి వెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నంద్యాల(న్యూటౌన్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. బుధవారం నంద్యాల పీఎస్సీ, కేవీఎస్సీ డిగ్రీ కళాశాలలో ఐసీడీఎస్, మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రతి విషయాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఆత్మస్థైర్యంతో జీవితంలో ముందడుగు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ దర్గయ్య మాట్లాడుతూ స్త్రీ హక్కులు, సంరక్షణ చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు ఐసీడీఎస్ అధికారులు నాగజ్యోతి, డాక్టర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఉయ్యాలవాడ : గర్భిణులు, తల్లులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అన్నారు. బుధవారం స్థానిక 1వ అంగన్‌వాడీ కేంద్రంలో పూర్వబాల్యదశ సంరక్షణ విద్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలన్నారు. 18 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న బాలికలకు వివాహాలు చేస్తే తర్వాత వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. దీనిపై బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆదామ్, కార్యకర్తలు ఫకూర్‌బీ, రాజేశ్వరమ్మ, గురులక్ష్మి, కాశింబీ పాల్గొన్నారు.

సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు

ఉయ్యాలవాడ: జిల్లాలోని సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించినట్లు జిల్లా సహకార బ్యాంకు అధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం మండలంలోని బోడెమ్మనూరు సహకార సంఘాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంప్యూటరీకరణను పరిశీలించి, ఇక మీదట లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. జిల్లాలో 56 సొసైటీలు ఉండగా ఇప్పటి వరకు శిరివెళ్ల, దీబగుంట్ల, చాగలమర్రి, తిమ్మాపురం, ఉయ్యాలవాడ మండలంలో హరివరం, బోడెమ్మనూరు సహకార సంఘాల్లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు జనరల్ మేనేజర్ శివలీల, సొసైటీ సీఈఓలు రామచంద్రయ్య, మౌలాలి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులకు వెంటనే పెండింగ్ డీఏలు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు ఘన విజయం సాధించిన నేపథ్యంలో బుధవారం పట్టణంలోని భరత మాత గుడి వద్ద ఉన్న విశ్వహిందూ పరిషత్ సమావేశ భవనంలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, తక్షణమే 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీల్లో మ్యాన్‌వల్ కౌన్సెలింగ్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంఘం నాయకులు శ్రీనివాసులు, కృష్ణారావు, రమణయ్య, విజయరావు, సుదర్శన్‌రెడ్డి, హుసేన్‌సాహెబ్, వివిధ మండలాల నాయకులు మాధవరెడ్డి, మోహిద్దీన్, ఏపీటీఎఫ్ 1938 నాయకులు నగరి శ్రీనివాసులు, సాంబశివుడు, కృష్ణారెడ్డి, ఏపీరెడ్డి పాల్గొన్నారు.

బెస్తకాలనీలో ఉద్రిక్తత

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం బెస్త కాలనీలో బుధవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాలనీలో ఉదయం ఓ వృద్ధుడు అనారోగ్య కారణంగా మృతి చెందాడు. అలాగే అదే కాలనీలో మరో ఇంట వివాహ వేడుకలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో వివిధ గ్రామాల్లో ఉన్న బంధువులు కా లనీకి చేరుకున్నారు.పెళ్లికి సంబంధించి ముహూర్త వేడుకల్లో కొందరు బాణసంచా పేల్చుకుంటు సంబరాలు చేస్తున్నారు. ఇంతలో ఓ యువకుడు ఆ మార్గంలో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఆపారు. ఈ విషయంలో ఇరువర్గాల వారు అక్కడికి చేరుకొని గొడవకు దిగారు. ఈ ఘటనలో కొందరు గాయపడ్డారు. అనంతరం ఇరు వర్గాలవారు పోలీసులను ఆశ్రయించారు.ఎస్‌ఐ వరప్రసాదు సిబ్బందితో బెస్త కాలనీకి వెళ్లి గుంపులు లేకుండా అందరిని పంపించారు. అయితే, కాలనీలో ఏ క్షణం ఏం జరుగు తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అలంకారం.. అపు'రూపం'

- ఘనంగా అహోబిలంలో బ్రహ్మోత్సవాలు
- నేటి నుంచి ప్రతి రోజూ అలంకార వాహనసేవలు
- పదోరోజు ధ్వజావరోహణంతో సమాప్తం





స్వామి అలంకరణ సేవకు సిద్ధమైన వాహనాలు



విద్యుత్‌దీపకాంతుల్లో దిగువ అహోబిలం

ఆళ్లగడ్డ: అహోబిలంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నేటి నుంచి అలంకార వాహన సేవలు ప్రారంభకానున్నాయి. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా బ్రహ్మోత్సవాల్లో ఈ వాహన సేవలు కొనసాగుతాయి. ఒక్కో రోజు ఎగువ అహోబిలంలో రెండు వాహనాల్లో, దిగువ అహోబిలంలో రెండు వాహనాల్లో స్వామి ఊరేగుతారు. ముందురోజు ఎగువలో కొలువైన వాహనాల్నే మరుసటి రోజు దిగువలో కొలువై ఊరేగుతారు. స్వామివారు అధిరోహించే ఒక్కో వాహనానికి ఒక్కో చరిత్ర ఉంది. ప్రతి వాహనంపై నుంచి స్వామి ఒక్కో సందేశమిస్తారు. నేటి నుంచి మొదలయ్యే ఈ ఉత్సవాల్లో భక్తులేకాదు ముక్కోటి దేవతలు సైతం పాలు పంచుకోనున్నారు.

సింహవాహనం

ధ్వజారోహణం జరిగిన మొదటి రోజు రాత్రి నరసింహస్వామి సింహ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తారు. దుష్టశిక్షణ, శిష్టపరిరక్షణకు సింహంపై ఊరేగుతారు.

హంస వాహనం

రెండోరోజు ఉదయం స్వామి హంస వాహనంపై దర్శనమిస్తారు. భక్తుల్లోని అహంభావాన్ని తొలగించి, జ్ఞానసిద్ధి, బ్రహ్మపద ప్రాప్తి కలిగించేందుకు హంస వాహనాన్ని అధిరోహిస్తారని పురాణాలు చెబుతున్నాయి.

సూర్యప్రభపై

రెండో రోజు రాత్రి సూర్యుని రథంపై ఎర్రటి మాల లు ధరించి స్వామి దర్శనమిస్తారు. సూర్యుడు సకలరోగ నివారకుడు. ఆరోగ్యకారకుడు. సూర్యప్రభ వాహనంలో ఉండే నారాయణుడిని దర్శించే భక్తులకు ఇతోధిక భోగభాగ్యాలు, సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని ప్రతీతి

శేషునిపై లక్ష్మీపతి..

నాలుగోరోజు ఉదయం స్వామి శేష వాహనంపై ఊరేగుతారు. శేషవాహనంపై శ్రీ అహోబిలేశుడు నెమలి పింఛం, పిల్లన గ్రోవితో మురళీకృష్ణుడి అలంకారంలో భక్తులకు కటాక్షిస్తారు.

హనుమంత వాహనం

మూడోరోజు రాత్రి అహోబిలేశుడు వెంకటాద్రిరాముని అలంకారంలో హనుమంత వాహనంపై కొలువుదీరుతారు. తన అనన్యభక్తుడైన హనుమంత వాహనసేవలో భక్తులను కటాక్షిస్తారు.

చుక్కలరేడుపై చక్కదనాలస్వామి

నాలుగోరోజు రాత్రి చల్లని వాతావరణంలో చంద్రప్రభ వాహనంపై వెన్నముద్ద కృష్ణుడి అలంకారంలో స్వామి దర్శనమిస్తారు. చంద్రప్రభ వాహనంపై ఊరేగే స్వామి దర్శనం భక్తులకు ఎంతో సంతోషం కలిగిస్తుంది.

జగన్మోహినిగా..

ఐదోరోజు ఉదయం స్వామి మోహినీ అవతారంలో శృంగార రసాధి దేవతగా దర్శనమిస్తారు. ఈ వాహనసేవలో స్త్రీలు ధరించే అన్ని ఆభరణాలతో స్వామిని అలంకరిస్తారు.

ముత్యపు పందిరిలో మూడు నామాలవాడు

ఆరో రోజు ఉదయం ముత్యపు పందిరి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నారసింహస్వామి వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు.

వరాలిచ్చే కల్పతరువు

ఆరో రోజు రాత్రి పొన్నచెట్టు వాహనంపై గోవుల గోపన్న అలంకారంలో స్వామి భక్తులను కటాక్షిస్తారు. కల్పవృక్షం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అలాంటి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి స్వామివారు భక్తులకు అభయ ప్రదానం చేస్తారు.

కరిపై బ్రహ్మాండ నాయకుడు

ఏడోరోజు ఉదయం గజ వాహనంపై శ్రీ అహోబిలేశుడు కొలువు దీరి భక్తులకు అభయప్రదానం చేస్తారు. ఈ వాహనసేవ దర్శనం ద్వారా కర్మ విముక్తి కలుగుతుందని విశ్వాసం

అశ్వవాహనంపై కల్కి అవతారై

ఎనిమిదో రోజు రాత్రి అశ్వ వాహనంపై స్వామి ఊరేగుతారు. స్వామి అశ్వాన్ని అధిరోహించి కల్కి అవతారంలో భక్తులను అనుగ్రహిస్తారు. కలియుగాంతంలో నారసింహుడు కల్కి అవతారంలో వచ్చి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తారని చెప్పడమే ఈ వాహన సేవ ఉద్దేశం

దివ్యరథంపై మహా వైభవం

ఎనిమిదోరోజు ఉదయం సూర్యుని కిరణకాంతుల్లో మేరుపర్వతం లాంటి రథంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఊరేగుతారు. భక్తులు రథం పగ్గాలను పట్టుకుని స్వయంగా లాగడం రథోత్సవం ప్రత్యేకత.

తీర్థవారి చక్రస్నానం

పదోరోజు ఉదయం స్వామి పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతుంది. తొమ్మిది రోజుల పాటు వాహన సేవల్లో అలసిపోయిన స్వామి సేదతీరడానికి ఈ స్నానం జరిపిస్తారు. వివిధ సుగంధ ద్రవ్యాలతో, ఉభయనాంచారులతో స్వామికి అభిషేక సేవ నిర్వహిస్తారు.

దాసుడిపై విహారం .. గోవిందుడి అభయం

పదో రోజు రాత్రి జరిగే గరుడోత్సవం బ్రహ్మోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనది. నారసింహస్వామి తనకు ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై దర్శనమిస్తారు. ఉత్సవంలో స్వామిని మూలమూర్తికి నిత్యం అలంకరించే విశిష్టాభరణాలతో అలంకరిస్తారు.

ధ్వజావరోహణంతో సమాప్తం

పదో రోజు అర్ధరాత్రి అనంతరం ధ్వజావరోహణం జరుగుతుంది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నరసింహస్వామి వారి సమక్షంలో బ్రహ్మాది దేవతలకు, అష్టదిక్పాలకులకు వీడ్కోలు చెబుతూ గరుడ కేతనాన్ని ధ్వజస్తంభం మీద నుంచి దించుతారు. దాంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

200 రోజులు ఉపాధి పని కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రతి వ్యవసాయ కూలీకి 200 రోజులు పని కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాజకీయ జోక్యం ఎక్కువైందన్నారు. వ్యవసాయ కార్మికులకు పనులు దొరకక ఆకలి దప్పులతో పొట్ట చేతపట్టుకొని ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలోని డోన్, ప్యాపిలి, నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి కూలీలకు రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని కోరారు. అలాగే యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, నారాయణ, జిలానీబాషా, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

దినసరి వేతనం రూ. 300కు పెంపు

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకంలో కూలీల దినసరి వేతనం రూ. 300కు ప్రభుత్వం పెంచిందని, ఇది 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు కానుందని కోవెలకుంట్ల ఆ శాఖ ఏపీడీ సాంబశివరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేసవి కాలం కావడంతో ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా కూలీలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 5.30 గంటల నుంచి 11 గంటల్లోగా పని చేసే ప్రదేశంలో పనులు ముగించుకుని గృహాలకు చేరుకోవాలన్నారు. కూలీల సంఖ్యను ఉపాధిలో పెంచాలని ఏపీఓ రవిప్రకాష్‌కు సూచించారు. అలాగే ఫాంపాండ్స్‌పై దృష్టి సారించి రైతులు పొలాల వద్ద తవ్వకాలు ప్రారంభించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: దీర్ఘ కాలిక వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జనరల్ మెడిసిన్ స్ఫూర్తి రెడ్డి, కంటి వైద్య నిపుణులు కావ్య, హారిక, స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు తనూజ అన్నారు. పట్టణంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నంద్యాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలు సరైన పౌష్టిక ఆహారం తీసుకోవాలని దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్‌తో పాటు కంటి, గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. శిబిరం ద్వారా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు అధికారులు, వైద్య సిబ్బంది, బ్యాంకు ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు



పోటీలో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక గురురాజ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీలను గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగినులు ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. గెలుపొందిన వారికి జిల్లా సంఘం కార్యాలయంలో ఈనెల 8వ తేదీన బహుమతులు అందజేస్తామని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిరుపాలయ్య, అధ్యక్షుడు శ్రీహరి, కోశాధికారి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఫకృద్దీన్, విజయలక్ష్మి, సిటీ అధ్యక్షుడు సత్యం, మహిళా అధ్యక్షురాలు ప్రభావతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 30 వరకు కేసీ కెనాల్‌కు నీరు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న రైతులు

నంద్యాల అర్బన్: కేసీ కెనాల్‌కు తక్షణమే నీటి విడుదల చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి డిమాండ్ చేశారు. కాల్వ ఆయకట్టు కింద 70 వేల ఎకరాల్లో పంటలు సాగులో ఉన్నాయని, నీరు వదలకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు కేసీ కెనాల్‌కు నీరు ఇవ్వాలంటూ బుధవారం రాయలసీమ సాగునీటి సాధనాసమితి ఆధ్వర్యంలో స్థానిక కేసీ కెనాల్ కార్యాలయం ఎదుట ఆయకట్టు రైతులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ ఏఓ గురు ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వైఎస్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణ, తుంగభద్ర నదులకు సంబంధించి 1562 టీఎంసీల నీరు శ్రీశైలం రిజర్వాయర్‌లోకి వచ్చి చేరినప్పటికీ కేసీ కాలువకు అర్ధాంతరంగా నీటిని నిలిపివేయడం అన్యాయమన్నారు. గతేడాది అరకొరగా వర్షాలు కురిసినా రబీ పంటలు పూర్తి అయ్యే వరకు గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం సాగునీటిని అందించి రైతులను ఆదుకుందన్నారు. రబీ పంటలను దృష్టిలో ఉంచుకుని అధికారులు కాలువకు నీరు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు చిన్నరామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ నాయకుల నిరసన



గాంధీ చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): ఢిల్లీలో ఎస్‌డీపీఐ జాతీయ అధ్యక్షుడు ఎస్‌కే పైజి అరెస్టు అక్రమమని ఆ పార్టీ నాయకులు అన్నారు. నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు హఫీజ్ అతావుల్లాఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వం విపక్షాల గొంతును నొక్కివేయడానికి ప్రయత్నిస్తుందని, ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. అసెంబ్లీ అధ్యక్షుడు ఎజాస్ హుస్సేన్ మాట్లాడుతూ పైజి అరెస్ట్ రాజకీయ కక్షతోనే జరిగిందని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు మజీద్ ఖాన్, కరీముల్లా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌కు సన్మానం

నంద్యాల అర్బన్: ఎటువంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొని విద్యుత్ వినియోగదారులకు 32 యేళ్లపాటు నాణ్యమైన సేవలందించిన లైన్‌మెన్ వరప్రసాద్ అభినందనీయులని నంద్యాల విద్యుత్‌శాఖ డీఈ రమేష్‌కుమార్ అన్నారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయనను సత్కరించారు. సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ సుబ్బారావు, జేఈ శివశంకర్, ప్రసాద్, డీ2 సెక్షన్ లైన్‌మెన్ పాల్గొన్నారు.

నమ్మి మోసపోవద్దు

నంద్యాల అర్బన్: ×ప్రభుత్వం నుంచి మూడు చక్రాల వాహనం, ల్యాప్‌టాప్ మంజూరయ్యాయి. ఇందుకు కొంత డబ్బు 96420 76467, 63000 90356 నంబర్‌లకు ఫోన్‌పే చేయాలంటూ వచ్చే వాటిని దివ్యాంగులు నమ్మి మోసపోవద్దని విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారిణి రెయిస్‌ఫాతిమా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మోసపూరిత మాటలకు లోనుకాకుండా దివ్యాంగులు జాగ్రత్తగా ఉండాలన్నారు. పరికరాల కోసం కార్యాలయ ఫోన్ నంబర్ 08518277864ను సంప్రదించాలన్నారు.

మద్యం విక్రేత్రల అరెస్టు

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న భరత్, ఫణీంద్ర అనే ఇద్దరు వ్యక్తులను బుధవారం ట్రైనీ డీఎస్పీ రాజసింహారెడ్డి అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఆయన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఫణీంద్ర, భరత్‌ను అదుపులోకి తీసుకు వారి నుంచి 39 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

నేటి నుంచి జగజ్జననీ ఆలయ వార్షిక వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీజగజ్జననీనగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయ వార్షిక వేడుకలు నేటి నుంచి ప్రారంభమవుతున్నట్లు శ్రీ దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ గౌరవ అధ్యక్షుడు పుల్లయ్య తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉదయం గణపతి పూజతో ఉత్సవాలు మొదలవుతాయని చెప్పారు. ఐదురోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మహిళల భద్రత, సాధికారతకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ: మహిళల భద్రత, సాధికారతకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక విశ్వశాంతి స్కూల్‌లో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏం కావాలో లక్ష్యం మేరకు అడుగులు వేయాలన్నారు. ఈ నెల 8న పోటీల్లో పాల్గొనే విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా, పాఠశాల కోఆర్డినేటర్ వరలక్ష్మి ఉన్నారు.

గిట్టుబాటు ధరల హామీ చట్టం అమలు చేయాలి



రుద్రవరంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు చేస్తున్న దృశ్యం

రుద్రవరం: రైతులకు గిట్టుబాటు ధరల హామీ చట్టాన్ని అమలు చేయాలని రైతు సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి కె.భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన రుద్రవరంలో బుధవారం వారు పలువురితో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు దాదాపు 200 రకాల పంటలు పండిస్తోంటే కేవలం 25రకాల పంటలకు మాత్రమే మద్దతు ధర ప్రకటిస్తున్నారన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం ఏ గ్రేడు మిర్చి ధర మార్కెట్‌లో రూ.17వేలు ఉంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.11,700 ఇస్తుందని మండిపడ్డారు. రైతులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులు, కార్మికులు, వారి సమస్యల పరిష్కారం కూడా అని చెప్పారు. సర్కారు ఇప్పటికైనా స్పందించి రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులను అరికట్టాలని డిమాండ్ చేశారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

ఉయ్యాలవాడ: మార్చి 17వ తేదీ నుంచి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల కేంద్రాన్ని బుధవారం ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన బెంచీలు, తాగు నీరు, మరుగుదొడ్ల తదితర వసతులను పరిశీలించారు. ఈ కేంద్రంలో 250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రానికి డిపార్ట్‌మెంటల్ అధికారి సుధాకర్, చీఫ్ సూపరిటెండెంట్ నరసింహులును నియమించినట్లు తెలిపారు.